అతని ప్రేమకు పులకించిపోయిన ఆమె అతన్ని ఎందుకు దూరం చేసుకుంది?

పెద్దకథ

# మడత పెట్టిన పేజీ

కొరుకొండ సత్యానంద్ కథ

రైలు కదిలింది. లోకంతోపాటూ రైలుకూడా సద్దుమణిగింతర్వాత నేను ఆలోచనల్లోకి వెళ్లిపోయాను.

నేను హైదరాబాదు వెళ్లడం ఇది నాలుగోసారి. పేజీ పూర్తిచేసి నిరుద్యోగిగా వున్నప్పుడు... వస్తుందని తెలిసి ఆశతో ఎదురుచూసిన పెళ్లిగ్రాం పదిహేను రోజుల నిరీక్షణ తరువాత వచ్చినప్పుడు ఉరుకుల పరుగులమీద బయల్దేరి వెళ్లడం... అది మూడోసారి అవుతుంది.

నాకా పెళ్లిగ్రాం వస్తుందని తెలిసింది నేను హైదరాబాదు రెండవసారి ఓ వ్రాత పరీక్షకు వెళ్లినప్పుడు. ఆ పరీక్ష రాయడం అయిపోయింతర్వాత ఓ ప్రక్క ఉద్యోగం చేసుకుంటూ మరో ప్రక్క పత్రికల్లో ఇల్లస్ట్రేషన్స్ వేసే 'వెంకు'ని కలిశాను. అతను ఓ చిన్న పత్రిక పెట్టాడు. రచయితగా, కార్టూనిస్టుగా కొత్త పేరున్న నాకు అతన్తో పరిచయం ఉంది. కాసేపు పిచ్చాపాటీ మాట్లాడింతర్వాత నేను అడుగుదామనుకున్నది అడిగాను.

"నేనూ మిమ్మల్ని ఆ విషయమే అడగాలనుకున్నాను మూర్తీ. అసోసియేట్‌గా చేస్తారా. మొదట్లో అయిదొందలిస్తాను. పత్రిక బాగా పోతుంటే క్రమంగా పెంచుతాను" అన్నాడతను.

ఏమీ లేనిదానికంటే ఏదో ఒకటి వుంటే బాగుంటుందనుకోవడం, నాకు అనుభవం ఆసక్తి ఉన్న రంగంలో అవకాశం రావడం... ఈ రెండూ కారణాలయ్యాయి నేను 'సరే' అనడానికి.

"మీరు వెళ్లండి. ఓ వారంలో పెళ్లిగ్రా



ం ఇస్తాను. అందిన వెంటనే బయల్దేరి రండి. మన ఆఫీస్‌కి దగ్గర్లోనే మీకోసం రూంకూడా చూసి వుంచుతాను.''

అతనిదగ్గర సెలవు తీసుకున్నాను. తల్లిద ం(డులకు భారం కాకుండా చిన్నదో పెద్దదో ఉద్యోగం సంపాదించుకోబోతున్నందుకు అప్పుడు నేను చాలా ఆనందపడ్డాను.

అదోలా అయిపోయింది. ఆమె ఆలోచన

ల్తోనే వదుస్తూ టాంక్‌బండ్ చేరుకున్నాను. లోయర్ టాంక్‌బండ్‌లో వున్న 'వెంకటేశ్వ రాలయం' చేరుకున్నాను.

అనుకున్న సిమెంట్ బెంచీమీద... 'అ ప్పుడు' ... నేను మొదటిసారి హైదరాబాదు వచ్చినప్పుడు ఎక్కడ కూర్చున్నానో అక్కడే కూర్చున్నాను. ఆ ప్రక్కనే శకుంతల కూర్చుంది. ఇప్పుడూ నా ప్రక్కనే కూర్చు న్నట్టు, అందంగా నవ్వుతూ మాట్లాడుతు న్నట్టే అనిపించింది. అప్పటికప్పుడే అదోలా అయిపోయాను. అప్రయత్నంగానే గతంలో కి జారిపోయాను.

☆ ★ ☆

'కాల్చుకోకు నీ హృదయాన్ని'

ఎమ్మెస్సీ రెండో సంవత్సరం చదువుతు న్నప్పుడు నేను రాసిన కథ పేరు అది. ఆ కథ చాలామందికి నచ్చింది. కొంతమంది ఉత్తరాలు కూడా రాశారు. ఉత్తరాలు రాసిన వారందరికీ సమాధానాలు రాశాను. ఆ తర్వాత కూడా నలుగురైదుగురు ఉత్తరాలు రాస్తుండేవారు. తర్వాత తర్వాత వాళ్లకూడా ఉత్తరాలు రాయడం మానేశారు.

శకుంతల తప్ప!

కథలైతే బాగానే రాయగలిగేవాడేనేమో గానీ, ఉత్తరాలు మాత్రం శకుంతలంత బాగా రాయలేకపోయేవాడిని. వారానికి రెం డు ఉత్తరాలు రాసేదామె. ఆమె ఉత్తరాల్లోని కొన్ని మాటలు నాకింకా గుర్తే... వాటిని జీవితంలో మరిచిపోలేనేమో!?

ఎమ్మెస్సీ అయ్యాక ఇంకా నిస్పృహ నిండని నిరుద్యోగ దశలో ఉన్నప్పుడు వైజాగ్‌లో రాసిన ఓ వ్రాత పరీక్షలో ఉత్తీర్ణుడ్నవ్వడంవల్ల ఇంటర్వ్యూకి పిలుపొచ్చి ంది. హైదరాబాదుకి. అప్పటికి మా మధ్య కలం స్నేహం కొనసాగుతుంది.

ఆమె అక్షరాలు, అవి కలిసి తెలియజేసే భావాలూ తప్ప ఎప్పుడూ ఆమెని చూడని నాలో ఆ ఇంటర్వ్యూ ఆమెని చూడాలనే అభిలాషను కలిగించింది. అదే రాశాను ఆమెకు. వెంటనే ఆమెనుండి జవాబు వచ్చింది.

"కోణార్క్ దిగి ఆటోగానీ, సిటీ బస్సుగానీ ఎక్కి టాంక్‌బండ్ మొదటి బస్టాపు దగ్గర దిగండి. అక్కడ ఓ పోలీస్ స్టేషన్ వుంటుంది. దానికెదురుగా కొంచెం ముందుకెళ్తే టాంక్ బండ్ కింద వేంకటేశ్వ రాలయం వుంటుంది. మెట్లుదిగి ఆ గుడి ఆవరణలో వున్న గార్డెన్లో సిమెంట్ బెంచీమీ ద కూర్చోండి. ఓ గంట పర్మిషన్ పెట్టి ఆఫీసునుండి అక్కడకు వస్తాను. మీకు తెలుసుగా నాకిష్టమైన రంగు మెరూన్ అని. ఆ రంగు చీరలో వస్తాను. అందుచేత నన్ను గుర్తుపట్టడం చాలా తేలిక అవుతుంది మీకు. మరి మిమ్మల్ని ఎలా గుర్తుపట్టాలి నేను. నేను రాసిన ఉత్తరాల్ని పట్టుకురండి... సరేనా?"

ఆమె చెప్పినట్టుగానే వెళ్లాను. ఆమెకోస ం నిరీక్షిస్తూ కూర్చున్న ఆ అరగంటలో నాలో ఏదో ఆత్రుత, అదోరకమైన అలజడిలా ంటి అనుభూతి వస్తున్న 'ఆమె'ను మెరూన్ కలర్ చీరనుబట్టి గుర్తుపట్టాను. ముందుగా నేనే పలకరించాను.

"ఉత్తరాలు తెచ్చారా?"

పరిచయమైన భావాలుగల అపరిచితమైన

వ్యక్తి ఎదురుకావడంతో ఆమెను గమనించడంలో వుండిపోయానేతప్ప ఆమె మాటల్ని సరిగా వినలేకపోయాను.

"ఉత్తరాలు తెమ్మని రాశానుగా?" మళ్లీ ఆమే అంది.

అప్పుడొచ్చాను ఈ లోకంలోకి.

"తెచ్చానండి. ఇదిగో. మొన్న మీరు రమ్మని రాసిన ఉత్తరం"

"మరి మిగిలిన ఉత్తరాలు?"

"నన్ను గుర్తించడానికి ఒక్క ఉత్తరం సరిపోతుందికదా అని అన్నింటినీ తీసుకురాలేదు"

"తీసుకురావాల్సింది"

"అవి మీ జ్ఞాపకాలుగా నా దగ్గరే వుంటాయి."

శకుంతల ఇంకేమీ అనలేదు. నేను కూర్చున్న సిమెంట్ బెంచీమీదే నా ప్రక్కన కూర్చుంది. ఆరోజు ఓ అరగంటకంటే ఎక్కువ కలిసి వుండలేదు మేము. ఆ అరగంటలో ఎక్కువ శకుంతలే మాట్లాడింది. నేనామెను చూస్తూ కూర్చున్నాను. రేపు ఇంటర్వ్యూ పూర్తయ్యే సమయానికి అక్కడికి వస్తాను అని చెప్పి వెళ్లిపోయింది. నేను ఓ లాడ్జిలో రూము తీసుకుని వున్నాను.

మర్నాడు ఇంటర్వ్యూ జరిగే చోటుకి వచ్చింది. అప్పటికి నా ఇంటర్వ్యూ అయిపోయింది. ఇంటర్వ్యూ ఎలా చేశారు — అవి అడిగింది. నేను బాగాచేయడానికి, చేయకపోవడానికి అసలు నన్నేమైనా ప్రశ్నలు అడిగితేనా? అదే చెప్పాను శకుంతలతో. భోజనాలు చేసి మళ్లీ మేమిద్దరం వేంకటేశ్వరస్వామి గుడిదగ్గరే కూర్చున్నాం.

"నిన్న నేనే మాట్లాడాను. ఈ రోజు మీరు మాట్లాడండి" అంది శకుంతల.

"నిన్న నేను మిమ్మల్ని చూస్తూ వుండిపోయాను. అందుచేతే ఏమీ మాట్లాడలేదు. మీ ఉత్తరాలకన్నా మీరు, మీకంటే మీ మాటలు ఎంతో బాగున్నాయి"

## పెద్దది

"నాన్నగారూ... ఒకటి పెద్దదా! ముప్పై రెండు పెద్దదా"

"ముప్పై రెండే పెద్దది"

"మరి నాకు ముప్పై రెండో ర్యాంకు వచ్చిందని మమ్మీ ఎందుకు అనవసరంగా తిడుతోంది"

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



''మీరు అందానికి ప్రాముఖ్యం ఇస్తారా?' శకుంతల సూటిగా అడిగింది.

''ఆ భావుకత, మంచి మనసు... వీటి తర్వాత అందానికి కూడా ప్రాముఖ్యత ఇస్తాను''

''అందం లేకుండా... భావుకతతో, మంచిమనసుతో మీరు సరిపెట్టుకోలేరా?''

''అందానికి అందం ఇచ్చేవి ఆ రెండే కదండీ?''

శకుంతల నవ్వింది. చిన్నగా. అందంగా. అప్పుడామె బుగ్గలు సొట్టలు పడ్డాయి. కనుబొమలు తమాషాగా ఎగిరిపడ్డాయి. తర్వాత చాలాసేపు నా కథలు, ఆలోచనలు, మా కుటుంబ సభ్యుల వివరాలు, ప్రైవేటు కంపెనీలో తన చిన్న ఉద్యోగం, అనుభవాలు, సాహిత్యంమీద ఆమెకున్న అభిమానం, అప్పుడప్పుడూ కథలు రాయడంలో ఆమె చేసిన ప్రయత్నాలు... అలా చాలా వాటిగురించి మాట్లాడుకున్నాం. అదేమిటో, ఈ రోజుకూడా శకుంతలే ఎక్కువ మాట్లాడింది.

ట్రైనుకింకా రెండు గంటలు టైముంది. శకుంతల గుడిలోకెళ్దాం అంది. వెళ్లాం. మళ్లీ వచ్చి అక్కడే కూర్చున్నాం.

''టైమవుతోంది... ఇంకేమిటి విషయాలు. ఏమైనా వుంటే చెప్పేయండి'' అందామె.

''చెప్పడానికి ఒకే విషయం వుంది''

''ఏమిటో...?''

మీరంటే నాకు చాలా ఇష్టం. మరి మీకు?''

''ఇష్టం వుండకపోవచ్చని నా ఏ చర్యవల్లనైనా అన్పించిందా?''

కథల్లో సంభాషణలు రాసినంత సులువుగా నేను బయట మాట్లాడలేను. అందులోనూ ఇలాంటి విషయం నాకంటే శకుంతలే బాగా మాట్లాడుతుందని అన్పించింది.

''లేదు''

''అంటే... ఇష్టం వుందనేకదా?'' అని నవ్వింది శకుంతల. స్ఫటికాల్లాంటి ఆమె కళ్లు చక్కగా, తమాషాగా ముడుచుకున్నాయి ఆమె నవ్వినప్పుడు.

''ఆ ఇష్టం అలాగే వుండాలా. ముందుకెళ్లే ఆలోచన ఏమైనా వుందా?''

వేనన్న ఆ మాటకు నవ్వడం ఆపేసి... ఒక్క క్షణం నా కళ్లల్లోకి సూటిగా చూసింది. తర్వాత తల దించుకుని తన అరచేతిమీద చూపుడువేలి గోటితో నెమ్మదిగా రాస్తూ ''అందుకింకా టైముంది'' అంది.

''అవును. అది నాకూ తెలుసు. ఇది కేవలం ప్రస్తావన మాత్రమే. బతుక్కి ధీమానిచ్చే ఉద్యోగం దొరికే వరకూ నాకూ ఆ ఆలోచన లేదు''

''పరిస్థితులు ప్రతికూలిస్తే మన స్నేహం మీరనుకున్నంత ముందుకు వెళ్లదేమోగానీ మీరన్నవారొకరున్నారని, మీరు నా అభిమాన వ్యక్తి అని నా మెదడు పొరల్లో, మనసు పుటల్లో జీవితాంతం వుండిపోతుంది''

అలా అంటున్నప్పుడు శకుంతల గొంతు అదోలా మారిపోయింది.

''అదేమిటి అలా అంటున్నారు?''

''మన భావాలకు భవిష్యత్తు ఇమిడిపోతే అది మన అదృష్టం అవుతుంది. కానీ

భవిష్యత్తుని మనం శాసించలేంకదా? అందుకే అలా అన్నాను. అంతే. ఇంకేం కాదు''

అప్పటికా మాటల్ని అంతకంటే ఎక్కువ పట్టించుకోలేదు. టైమవ్వడంతో ఇద్దరమూ స్టేషన్‌కి చేరుకున్నాం. దారిలో లాడ్జికి వెళ్లి నా సూట్‌కేస్ తీసుకున్నాను. ట్రైన్ కదిలేవరకూ వుంది శకుంతల. ట్రైన్ కదిలింతర్వాత నావైపు అదోలా చూస్తూ వీడ్కోలు చెప్పింది. నేనుకూడా... క్షణాలకాలంలో ట్రైన్ వేగం పెరిగి శకుంతల కనుమరుగైపోయింది.

అప్పటికప్పుడే నా మనసేదో వెలితిగా అయిపోయింది.

నేను వైజాగ్ చేరుకుని పది రోజులవుతుందేమో — శకుంతల దగ్గర్నుండి ఓ లెటర్ వచ్చింది. వైజాగ్ వచ్చిన వెంటనే శకుంతలకు నేను రాసిన ఉత్తరానికి రిప్లై అనుకున్నాను గానీ అందులో అసలేమీ అర్థంకాని, ఎటువంటి కారణం అంతుబట్టని విషయం వుంటుందని ఊహించలేదు.

''మీరు వ్రాసిన ఉత్తరం అందింది. జవాబివ్వడం ఆలస్యం అయింది. అందుకు కారణం నాకొచ్చిన ఓ ఆలోచన. మన స్నేహం కలకాలం బ్రతికి వుండాలంటే ఇలా మనమధ్య ఉత్తరాలే నడవక్కర్లేదు. గుండెలో వుండిపోతే చాలు. అవునంటారా? మీరు అవునన్నా, అనకపోయినా ప్రాధేయపూర్వకమైన నా విన్నపాన్ని మన్నించాలి. ఆచరించాలి... ఇకమీదట మీరింకెప్పుడూ నాకు ఉత్తరాలు రాయొద్దు. ప్లీజ్!''

అదీ ఉత్తరంలో నాకిప్పటికీ గుర్తుండిపోయి గుండెను కొరికేస్తున్న విషయం! ఆ ఉత్తరాన్ని పదేపదే చదివాను. అదే విషయం. ఎందుకో అర్థంకాని, కారణం ఏమిటో అంతుబట్టని విషయం అదే. అయినా నేనూరుకోలేదు. మళ్లీ ఉత్తరం రాసేను.

''మీరన్నదానికి కాదని ఒక్కడుగు ముందుకేయను. కానీ మీకలాంటి ఆలోచన

## మీసాలు



ఒకప్పుడు జైపూర్ నగరంలోకి ఎవరు వెళ్లాలన్నా ఒక వింత షరతును నగర పాలకులు విధించారు. మీసాలు లేనివారినెవ్వరినీ, ఊరి పొలిమేరలోని గేటుగుండా సైనికులు లోనికి రానిచ్చేవారు కాదు! అందువల్ల అంతా తప్పనిసరిగా మీసాలు పెంచేవారు. తమాషాగా వుందికదూ!

ఎందుకు వచ్చింది. అందుకు కారణం ఏమిటి? వివరించి రాస్తే, అది కన్విన్స్ చేస్తే ఇంక మీకెప్పుడూ ఉత్తరం రాయను''

తిరుగుటపాలో శకుంతలనుండి రిప్లై వచ్చింది.

''నామీద అభిమానం వున్న మీరు నేనలా రాసినందుకు చాలా బాధపడి వుంటారని ఊహించగలను. అదే అభిమానాన్ని మీ గుండెలో జీవితాంతం పదిలపరచుకుని ఎప్పుడూ ఉత్తరం రాయొద్దన్నానన్న విషయం విస్మరించి మళ్లీ నాకు ఉత్తరం రాస్తారని ఊహించలేదు. కానీ మీరు మళ్లీ ఉత్తరం రాశారు. మీకు జవాబు రాయగూడదని అనుకున్నాను. కానీ మకు మనం మాట్లాడుకున్న మాటల్లోని ఓ మాటను గుర్తుచేద్దామని రాస్తున్నాను. మనం విడిపోయేటప్పుడు నేనో మాటన్నాను గుర్తుందా? 'మీరన్నవారొకరున్నారని, మీరు నా అభిమాన వ్యక్తి అని నా మెదడుపొరల్లో, మనసు పుటల్లో జీవితాంతం వుండిపోతుంది' అని అన్నాను. అదిమాత్రం నిజం మూర్తిగారూ. కారణం, పరిస్థితులు ఇవేమీ చెప్పలేను. ఎందుకు అని అడుగుతూ మళ్లీ ఉత్తరం రాయొద్దు. నన్ను కలుసుకోడానికి ప్రయత్నించొద్దు.... వుంటాను''

అదే శకుంతల రాసిన చివరి ఉత్తరం. చదివి నేను క్రుంగిపోయాను. ఏమీ అర్థంకాక తల్లడిల్లిపోయాను. కారణం ఏమై వుంటుందా అని ఆలోచించి తల పగులగొట్టుకున్నాను.

☆ ☆ ☆

గతం కళ్లముందు కదలాడుతున్నప్పుడు అప్రయత్నంగా కన్నీరుబికినట్టుంది. నా చెంపలు తడిగా వున్నాయి. మూగ వేదనా భారం కన్నీటిరూపంలో వెలుపలికి వచ్చేయడం వల్లనో మరేమో గుండె కాస్త తేలికపడినట్లయింది.

శకుంతల ఆలోచనలు మొదలై పెరిగే భారం కొంత సేపటికి తేలికైపోవడం... మళ్లీ ఎప్పుడో ఒకప్పుడు ఆ ఆలోచనలు రేగడం, గుండె భారమైపోవడం... ఇప్పటికిలా ఎన్నిసార్లు జరిగిందో? శకుంతల మొదటిసారిగా, చివరిసారిగా కలిసిన ఆ ప్రదేశాన్ని చూస్తుంటే నాకు మళ్లీ శకుంతలను చూడాలని అనిపిస్తోంది. కాకతాళీయంగా ఆమే అటువైపు వచ్చి నాకు కనిపిస్తే బాగుండునన్న ఆశ కలుగుతుంది.

నేనే వెళ్లి ఆమెకు కనిపిస్తేనో? ఈ రోజుకి వుండిపోయి రేపు ఉదయం వాళ్లాఫీసుకి వెళ్లి కలిస్తేనో. అలా చేస్తే శకుంతలను చూడ్డం జరుగుతుందికానీ ఆమె తన చివరి ఉత్తరంలో ఏం రాసింది? మళ్లీ ఉత్తరం రాసినందుకే ఆమె ఊహించని పని చేశానని రాసింది. ఇప్పుడు వెళ్లి కనబడితే...?

వద్దు. ఒకరినొకరు కలుసుకుని స్నేహాన్ని చంపుకునేకంటే ఎదురుపడకుండా మెదడుపొరల్లో, గుండె అరల్లో ఆ స్నేహాన్ని వుంచుకోవడమే మంచిది. అలా ఆలోచించి అప్పటికి ఆ ప్రయత్నాన్ని విరమించుకుని ఆ రాత్రే రైలెక్కేశాను. మరో పదిహేను రోజులకు 'వెంకు' దగ్గర్నుండి టెలిగ్రాం వచ్చింది. వెంటనే రెండు సూట్‌కేసుల్తో, రెండు చేతి సంచుల్తో హైదరాబాదు ప్రయాణమైపోయాను. వ్రాత పరీక్షలకు,


ఇంటర్వ్యూలకు హాజరైనప్పుడు చాలా మామూలుగా వుండేదిగానీ... ఈసారి హైదరాబాదు ప్రయాణం అయినప్పుడు నా గుండె విచిత్రంగా బరువెక్కిపోయింది. మా ఇంట్లో వాళ్లైతే మరీను. కన్నీళ్ల పర్యంతం అయిపోయారు.

హైదరాబాదు చేరుకున్న మర్నాడే అసోసియేట్‌గా చేరిపోయాను. పత్రికాఫీసుకు దగ్గర్లోనే నా రూమ్‌కూడా. ఇంక ఆ రోజునుండి పోస్ట్‌లో వస్తున్న రచనల, కార్టూన్ల పరిశీలన. ప్రెస్ ప్రూఫ్‌రీడింగ్. డమ్మీ దగ్గర్నుండి లే అవుట్, పత్రిక పూర్తయ్యేవరకు ఏజెంట్స్ కరస్పాండెన్స్‌తో సహా అన్ని దశల్లోనూ అన్నీ నేనే. అంతా నేనే. అందుకు శ్రమ అన్పించినా ఎంతో సంతృప్తిగా వుండేదే... రోజూ నేను చేసే ప్రతి పనినీ వెంకు వచ్చి విమర్శనాత్మక దృష్టితో ఇంకా ఏదేదో చేయలేదనే అసంతృప్తి వ్యక్తీకరణతో ప్రవర్తించి వుండకపోతే!

కొన్నాళ్లకు పెంచుతానన్న జీతం పెంచకపోయినా, ఇస్తానన్న జీతం పూర్తిగా ఇవ్వకపోయినా... రోజురోజుకూ పెరుగుతున్న జులుంలాంటి ప్రవర్తన, పండుగలకు వైజాగ్ ప్రయాణమవుతుంటే రోజులు, ట్రైన్లు పోస్ట్‌పోన్‌మెంట్ చేస్తుండడం... క్రమక్రమంగా సంపూర్ణంగా అస్వతంత్రుడనవుతున్నానన్న భావన మొదలైంది.

ఎలా గడిచిపోయిందో ఓ సంవత్సరం. ఆ వాతావరణంనుండి పారిపోవాలన్పించింది. ఆ మాత్రం డబ్బు నేను సిన్సియర్‌గా కథలు రాస్తే, కార్టూన్లు వేస్తే రాకపోదులే అని అన్పించడం, ఆ విషయాన్ని వ్యక్తీకరించడం, కొద్దిరోజుల 'కోల్డ్‌వార్' అనంతరం నా తిరుగు ప్రయాణాన్ని నేనే నిర్ణయించుకున్నాను. అనుకున్నట్టుగానే వైజాగ్‌కి ప్రయాణమైపోయాను.

ఉండమని బతిమలాడ్లేదుగానీ మరోసారి ఆలోచించమని అన్నాడు వెంకు. అదే



ఆలోచనతో అలసిపోయి విసిగిపోయిన నేను ఆలోచించడానికి ఇంకేముంటుంది. అదే విషయాన్ని చెప్పి వైజాగ్ వెళ్లిపోయాను.

ఆ సంవత్సరకాలంలో శకుంతల నాకు గుర్తురాకపోలేదు. అసలు మరచిపోతేకదా గుర్తురాకపోవడానికి. ఒకసారి ఎంత కష్టపడి నా ఆపుకోలేక ఓ ఇన్‌లాండ్ లెటర్ రాశాను.

"నేను హైదరాబాదులోనే వున్నాను. 'వల్లరి' అసోసియేట్ ఎడిటర్‌గా. నా అడ్రస్సు క్రింద రాశాను" అని రెండు ముక్కలు రాశాను. ఆఫీస్ అడ్రస్‌కి.

అది రెండు రోజుల్లో తిరిగొచ్చేసింది. కొన్నాళ్ల తర్వాత ఆమె ఆఫీస్‌కి వెళ్లాను. వాకబు చేస్తే ఆమె చాన్నాళ్ల కిందటే రిజైన్ చేసిందని తెలిసింది. మరలా ఎక్కడైనా జాయినైందేమోనన్న విషయం తెలియలేదు. ఆమె కాదన్నా, వద్దన్నా కలుసుకోవాలన్న కోరిక ఎక్కువై ఇంటికి కూడా వెళ్లి వుండేవాడినేమో ఆమె ఇంటి అడ్రస్సు తెలిసి వుంటే.

ఆ తర్వాత ఆమె గురించి నేనలా వెళ్లడం, కలుసుకోవడానికి ప్రయత్నించడం పిచ్చితనమని... ఆమెను మరచిపోతేనే మంచిదని నిర్ణయించుకున్నాను.

వైజాగ్ చేరుకుని షరా మామూలుగా ఉద్యోగాల వేటలో పడ్డాను. నా కృషి ఫలితమో, నా అదృష్టమో... నా జీవితానికి ఊపిరిగా ప్రభుత్వోద్యోగం దొరికింది.

అప్పట్నించి కాలం దొర్లే వేగం పెరిగింది. కొన్నాళ్లకు భర్తను మరికొన్నాళ్లకు తండ్రినీ అయ్యాను.

శకుంతలను మరిపించే శక్తి కాలానికి ఉన్నా... శకుంతల పేరుతో పత్రికల్లో అప్పుడప్పుడూ వచ్చే కథలు శకుంతల పేరుని, ( కథలు రాసింది నాకు తెలిసిన శకుంతలే అని తెలియజెప్పిన ఓ వారపత్రిక లోని ఫోటో... నన్నామెను మరచిపోకుండా చేశాయి. శకుంతల ఉత్తరాలు ఎన్నో చదివిన నాకు ఆమె కథలు చదువుతుంటే అవి ఆమే చదివి విన్పిస్తున్నట్టుగా అన్పించేది.

ఆరేళ్ల కాలం గడిచిపోయింది.

మళ్లీ ఇదిగో. ఆఫీస్ పనిమీద ఇక్కడకు రావడం ఇదే! సికింద్రాబాదు చేరే సరికి ఏడు గంటలయింది. అక్కడ దిగి లాడ్జిలో రూమ్ తీసుకున్నాను.

ఆఫీస్ పని అయిపోయాక వైజాగ్ వెళ్లిపోదామా, మరో రోజు ఉందామా అని ఆలోచించాను. హైదరాబాదులో వెళ్లి కలవడానికి, మాట్లాడానికి చాలామంది వున్నారు నాకు. చాలామంది 'వల్లరి'లో చేస్తున్నప్పుడు పరిచయమైనవాళ్లే. అందరూ పత్రికల్లో సబ్ ఎడిటర్లగానో, ఆర్టిస్టుల్లాగానో పన్జేసేవాళ్లే. అందరికంటే అందరికంటే పురుషోత్తం నాకు సన్నిహితుడు. కానీ ఈ మధ్యన కథలు ఎక్కువగా వస్తున్న ఆంధ్రహిత పత్రిక ఇప్పుడు నేనుంటున్న లాడ్జికి దగ్గర కావడంతో ముందుగా ఆ పత్రికకు వెళ్లి పురుషోత్తం దగ్గరకు వెళ్దామనుకుని బయల్దేరాను.

ఆంధ్రహిత ఎడిటర్ ఇన్‌ఛార్జి అయిన వెంకట్‌తో నాక్కాస్త పరిచయం వుంది. వెళ్లి అతనిని కలిశాను. పత్రికలు, ఇప్పుడు పరుగుపందాలేసుకుంటున్న సీరియల్స్, నిజమైన విలువల్ని పెంచుకుంటున్న కథలు...

వాటి గురించి సాగింది మా సంభాషణ.

ఆ వారం పత్రిక పూర్తయింది. వెంకట్ నాకో కాపీ ఇచ్చారు. దాన్ని తిరగేస్తూ అందులో కన్పించిన ఓ ప్రకటన దగ్గర ఆగిపోయాను.

... వచ్చేవారంనుండే 'సంగమం' సీరియల్ ప్రారంభం. రచన : కోరుకొండ శకుంతల.

అంతవరకూ వడవడా వాగిన నేను ఆగిపోయానేమో "చెప్పండి మీ వైజాగ్ రచయితల, రచనల విశేషాలు" అన్నాడు వెంకట్.

"ఏముందిలెండి మామూలే... అవునూ, ఈ సీరియల్ రాస్తున్న శకుంతల అనే ఈమె అంతకుముందు కొన్ని కథలు వ్రాశారు. కొన్ని మీ పత్రికలోకూడా వచ్చాయికదా ... ఆమేనా? అని అడిగాను నేను.

"కాదు. ఈమె నూతన రచయిత్రి. సీరియల్ బాగుంటుంది. చదవండి. మీరన్న శకుంతల అనే ఆమె సర్‌నేమ్ పెట్టుకోదు. ఒట్టి 'శకుంతల' అనే రాస్తుంది. ఆమెదీ ఊరే. 'మేఘమాల' వీక్లీలో ఎడిటోరియల్ సెక్షన్లో చేస్తున్నట్టుందామె...

నేనడగకుండానే, నాకు అవసరమని తెలిసినట్టుగా శకుంతల గురించి చెప్పారు వెంకట్. ఆ తర్వాత ఎక్కువసేపు నేనక్కడ వుండలేదు. వెంటనే ఆటో ఎక్కి 'మేఘమాల' ఆఫీసుకి వెళ్లమన్నాను. ఆటోకంటే వేగంగా పరుగెడుతున్నాయి ఆలోచనలు. ఇలా శకుంతల ఉనికి తెలియడం నేను ఊహించనిది. ఎలాగూ నేను 'మేఘమాల' ఆఫీసుకి వెళ్దామనుకున్నాను. అప్పుడు ఎలాగూ కన్పించి వుండేదేమో. కన్పించకపోయినా కన్పించకపోవచ్చుకూడా. ఎందుకంటే నేను కలిసే పురుషోత్తమ్ ఆర్ట్ సెక్షన్‌లో వుంటాడు. శకుంతల వుండేది ఎడిటోరియల్ సెక్షన్ కాబట్టి కన్పించడానికి అవకాశం లేకపోవచ్చేమో. వెంకట్‌గారు ఆ సమాచారం

## ఆలస్యం

మేనేజర్ కోపంగా అడిగాడు గుమస్తాని
"ఆఫీసుకు లేటుగా వచ్చేవేం"
"అటెండర్ వలన"
"నీవు లేటయి అటెండర్ వలన అంటావేం"
"అవునండి... వాడే మీరు ఈ రోజు సెలవు అని చెప్పింది"

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



ఇచ్చి వుండకపోతే మేఘమాల ఆఫీసులో శకుంతల... అది నా ఊహకు అందనిది.

మేఘమాల పత్రికాఫీసువద్ద ఆటో ఆగి ంది. ఆఫీసు గేటుదగ్గర పురుషోత్తమ్ గురించి అడిగి లోపలకు వెళ్లాను. ఆర్ట్ సెక్షన్లో పురుషోత్తమ్ సీట్లోనే వున్నాడు. నన్నుచూసి ఆశ్చర్యపోయాడు.

"ఏంటి మూర్తీ ఇంత సడెన్‌గా?"

ఆఫీసు పనిమీద ఇక్కడకు వచ్చిన వైనం చెప్పాను.

"ఒక్క కార్డ్ రాసి వుంటే నా రూమ్‌లోనే దిగేవాడివిగా?"

"అనుకోని అర్జంటు ఆఫీసు పని. తెలియజేయడానికి టైమ్ లేకపోయింది"

"పురుషోత్తమ్ నా మంచి చెడ్డలు అన్నీ అడిగేడు. కాసేపలా మాట్లాడుకున్నాక... "ఎడిటర్‌గార్ని కలుస్తావా, తీసుకెళ్తాను" అని అడిగేడు.

"అలాగే... పద" అన్నాను.

"పై ఊరినుండి వచ్చే రచయితల్తో మా ఎడిటర్‌గారు బాగా మాట్లాడతారు. నిన్ను తీసుకెళ్లి వేచొచ్చేస్తాను. ఈ ఇల్లస్ట్రేషన్స్ అయ్యాక రూమ్‌కి వెళ్దాం"

ఇద్దరమూ ఎడిటర్‌గారి క్యాబిన్‌కి బయ లుదేరాం. పురుషోత్తం వాళ్ల సెక్షన్‌నుండి ఎడిటర్‌గారి క్యాబిన్లోకి వెళ్తున్న దారిలో ఓ రూమ్ బయట 'ఎడిటోరియల్ స్టాఫ్' అన్న బోర్డు కనిపించింది. నా నడక వేగం తగ్గింది. అక్కడకు వెళ్లేసరికి.

పురుషోత్తం గమనించినట్టుంది... ఎడి టర్‌గారు కాసేపట్లో బయటికి వెళ్లొచ్చు. ముందు ఆయన్ని కలు. తరువాత ఎడిటోరి యల్ స్టాఫ్‌ని కలుద్దువుగాని" అన్నాడు.

ఆ రూమ్ ప్రక్కనుండి వెళ్తున్నప్పుడు గది లోపలకు కొద్దిగా తొంగిచూశాను. శకుంతల కన్పిస్తుందేమోనని. ఓ రెండు సీట్లలో వున్న మగవాళ్లు కనిపించారుగానీ శకుంతల కనిపించలేదు. నన్ను ఎడిటర్‌గారి దగ్గరకు తీసుకెళ్లి నేను కూర్చున్నాక పురు షోత్తం వెళ్లిపోయాడు. ఎడిటర్‌గారితో ఓ పది నిమిషాలు మాట్లాడి వస్తానని చెప్పి సెలవు తీసుకున్నాను.

పురుషోత్తం దగ్గరకు వెళ్తూ దారిలో వున్న ఎడిటోరియల్ స్టాఫ్ రూమ్ దగ్గర ఆగాను. అంతలో ఆ రూమ్‌లోకి వెళ్తున్న ఓ వ్యక్తి నన్ను గుర్తించి పలకరించాడు. తనతో రమ్మని లోపలకు తీసుకెళ్లాడు. ఆ రూమ్ లోకి ప్రవేశించిన వెంటనే నా కళ్లు అన్నివైపులా పరిశీలించాయి. అన్ని సీట్లలో ఎవరో ఒకరున్నారు. ఏ సీట్లోనూ శకుంతల లేదు. అయితే ఒక్క సీటు మాత్రం ఖాళీగా వుంది.

అతను నాతో ఐదు నిమిషాలు మాట్లాడే డు. నేనుకూడా ఏదో మాట్లాడానేగానీ నా దృష్టి అంతా ఆ సీటుమీదే వుంది. అతన్నే శకుంతల గురించి అడిగేయాలన్నంత ఆత్రు త కలిగిందిగానీ అతికష్టంమీద నన్ను నేను కంట్రోల్ చేసుకుని అతని దగ్గర సెలవు తీసుకుని పురుషోత్తం దగ్గరకు బయలుదేరా ను. శకుంతల గురించి మామూలుగా పురుషోత్తం దగ్గరే ప్రస్తావిద్దామని నా ఆలోచన!

ఆర్ట్ సెక్షన్‌లో అడుగుపెట్టి పురుషోత్త మ్ సీటుదగ్గరకు వెళ్తున్నాను.

"శంకర్‌కి ఖాళీ లేదు. కాస్త అర్జెంటు. ఈ ఆర్టికల్‌కి చిన్న ఇలస్ట్రేషన్ గీసి ఇచ్చేయండి. ప్లీజ్..."

దశాబ్దాలుగా పెరిగిన మహా వృక్షపు వేళ్లు భూమిలోకి ఎంత లోతుగా చొచ్చుకు పోతాయో... అంత లోతుగా ఎప్పుడో నా గుండె లోతుల్లోకి దూసుకుపోయిన ఓ మృధుమధురమైన స్వరం నా చెవిన పడ్డంతో స్మృతిపథంలో ఓ మెరుపు మెరిసి ఒక్కుదుకున తలెత్తి అటువైపు చూశాను.

పురుషోత్తమ్ సీటుదగ్గర ఆమె పురుషోత్తమ్‌తో మాట్లాడుతూ... ఆమె ... ఆమె శకుంతల.

ఆమె శకుంతలే!

నా నడకలో వేగం తగ్గిందో, పెరిగిందో గానీ, ఏదో మార్పు మాత్రం వచ్చింది. శకుంతల చేతిలోని పేపర్లను అందుకుంటూ ... 'అలాగే' అన్న పురుషోత్తం దృష్టి నామీద పడింది.

"రా మూర్తీ, రా..." అన్నాడు. అప్పుడే శకుంతల నావైపు చూసింది.


ఆమె ముఖంలో అప్పటికప్పుడే వచ్చిన అదోరకమైన మార్పును నేను గమనించకపోలేదు. నాలోకూడా అలాంటి మార్పే వచ్చి వుండొచ్చు.

"హి ఈజ్ మూర్తి ఫ్రం వైజాగ్. నాటోన్లీ మై ఫ్రెండ్. ఆల్సో ఏ రైటర్. 'సుస్మితా కృష్ణమూర్తి' మీరు చూసే వుంటారు పత్రికల్లో. చాలా కథలు రాశాడు" అని శకుంతలకు నన్ను పరిచయం చేశాడు. నేను కనురెప్పలు వేయకుండా శకుంతలనే చూస్తున్నాను. అప్పటికీ ఇప్పటికీ ఆమెలో ఏ మార్పూ కన్పించలేదు నాకు.

"మూర్తీ. షి ఈజ్ మిస్ శకుంతల. సబ్ ఎడిటర్. సాహిత్యం అంటే మంచి అభిరుచి. పత్రికల్లో కొన్ని కథలు రాశారు" అని శకుంతలను పరిచయం చేశాడు.

శకుంతల నావైపు చిన్నగా నవ్వుతూ

## ఛుక్ ఛుక్ రైళ్లు!



ఆసియా ఖండంలోనే, మన రైల్వే శాఖ చాలా పెద్దదిగా పేరు ప్రఖ్యాతులు పొందింది. ప్రపంచంలోని అతి పెద్ద రైల్వేలలో మన రైల్వే శాఖ నాల్గవది. మన దేశంలో రోజూ *400* మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళు, *1500* ప్యాసింజర్ రైళ్లు ప్రజలను వారి గమ్యానికి చేరుస్తున్నాయి! రోజుకు కోటిమంది ప్రయాణికులు ఈ రైళ్లలో ప్రయాణాలు చేస్తున్నారు! గూడ్స్ రైళ్లు ప్రతిరోజూ *10* లక్షల టన్నుల సామాన్లను, వివిధ రకాల సరుకులను దేశం నలుమూలలకూ చేరవేస్తున్నాయి!

— కొడిమెల

చూసింది. అయితే ఆ నవ్వులోని కృత్రిమత్వాన్ని నేను గమనించకపోలేదు.

"వస్తాను పురుషోత్తమ్. ఇలస్ట్రేషన్ పూర్తిచేసి సెక్షన్లో ఇచ్చేయండి" అంది.

"అదేమిటి. మీరుండరా?" అడిగాడు పురుషోత్తం.

"లేదండి. నాకొంచెం పనుంది. వెళ్లిపోతాను" అంది. అలా చెప్పడానికి శకుంతల పడిన ఇబ్బంది పురుషోత్తం గమనించాడో లేదోగానీ నాకుమాత్రం అర్థమైంది.

శకుంతల అక్కడ్నుండి వెళ్లిపోయింది. పురుషోత్తం ఎదురుగా కూర్చున్నానేగానీ నా మనసు మనసులో లేదు.

ఐదు నిమిషాలు అవుతుందేమో వడివడిగా బయటకు వెళ్లిపోతున్న శకుంతల కన్పించింది. అంటే శకుంతల ఇంటికో, ఎక్కడికో... నేనున్న ఆ ప్రదేశానికి దూరంగా వెళ్లిపోవాలనే వెళ్లిపోతుందన్నమాట. ఈ అవకాశాన్ని జారవిడుచుకోకూడదనుకున్నాను.

"పురుషోత్తం నేను వెళ్తాను" అన్నాను.

"అదేమిటి. వుండు. రూమ్‌కి వెళ్దాం" అన్నాడు.

"రెండ్రోజులుగా రెస్ట్ లేదు. నువ్వు నా రూమ్‌కి రా. అంతవరకూ నేను రెస్ట్ తీసుకుంటాను" అని నేనుండే లాడ్జి, రూమ్ నెంబరూ చెప్పి లేచాను.

"ఈ అర్జంట్ ఇలస్ట్రేషన్స్ లేకపోతే నేనూ వచ్చేవాడినిప్పుడు. సర్లే, నువ్వు రెస్ట్ తీసుకో. ఐదు, ఆరు గంటల మధ్య నేనే వస్తాను రూమ్‌కి" అని నన్నొదిలేశాడు.

'థాంక్ గాడ్'అనుకుని వడివడిగా అక్కడ్నుండి బయటకు వెళ్లాను.

ఆఫీస్ కాంపౌండ్ బయటకు వచ్చి ఎడమవైపున్న బస్టాపు వైపు చూశాను ఆతృతగా.

అక్కడ శకుంతల వుంది. రెండంగల్లో అక్కడకు చేరుకున్నాను. అది ఆఫీసులు, కాలేజీలు ఇంకా వుండే సమయం కాబట్టి బస్టాపులో ఎవరూ లేరు.

"శకుంతలా" అని పిలిచాను. ఆమె నావైపు తలత్రిప్పి చూసి మళ్లీ తల త్రిప్పేసుకుంది.

"అయాం సారీ. ఎప్పుడూ ఉత్తరం రాయడంగానీ, కలవడానికి ప్రయత్నించడంగానీ చేయొద్దని అన్నా మిమ్మల్ని కలిశాను. ఎందుకో తెలుసా?"

"... ..."

"అసలలా చేయొద్దని రాయడానికి కారణం ఏమిటి?"

"... ..."

"శకుంతలా ప్లీజ్"

"ఇది బస్టాపు. దారినపోయేవాళ్లందరూ మనవైపే చూస్తారు. ప్లీజ్ నాతో ఏమీ మాట్లాడకండి"

"శకుంతలా ఒక్క మాట చెప్తే చాలు. నేను వెళ్లిపోతాను..."

"అది అంత అవసరమా? అదీ ఇన్నేళ్ల తర్వాత"

"అవసరమనికాదు. జీవితాంతం వెంటాడి వేధించే ప్రశ్నగా మిగిలిపోతుందది"

"పెళ్లి చేసుకున్నారా?"

"ఆ..."

"తండ్రికూడా అయ్యుంటారు?"

"ఒక బాబు..."

"ఆ విషయం తెలుసుకోకుండా వుండలేనివారు ఇవన్నీ ఎలా చేయగలిగారు?"

"తప్పలేదు. తప్పించుకోలేకపోయాను"

"కాదులెండి. ఆ స్నేహం, ఆ కారణం మీ జీవితంమీద ఎటువంటి ప్రభావాన్నీ చూపలేకపోయింది"

"అని మీరనుకుంటే చేసేదేముంటుంది? కానీ ఎన్ని రాత్రుళ్లు, ఎన్ని రోజులు నేనెంత నరకయాతన అనుభవించానో తెల్సా? ఒక సంవత్సరంపాటు ఇక్కడే మీకు దగ్గర్లోనే వుండి మిమ్మల్ని కలుసుకోలేక, కలుసుకోకుండా వుండలేక ఎంత సతమతమయ్యానో మీరు తెలుసుకోగలిగితే, కనీసం ఊహించగలిగితే మీరలా అనుకుని వుండరు"

"ఇంక ఆ విషయం వదిలేయండి. మీరు నేను మళ్లీ కన్పించడం మన దురదృష్టం!"

"కాదు శకుంతలా... అది నా అదృష్టం"


అంతలో వస్తున్న సిటీ బస్సు ఎక్కడానికన్నట్లుగా హ్యాండుబ్యాగు, చేతిలో పుస్తకాలు సర్దుకుంటూ నావైపు చూసింది ఒక్కసారి. ఏదో చెప్పబోయి ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటున్నట్లు నాకు అర్థమైపోయింది.

నేను ఆతృతగా 'శకుంతలా ప్లీజ్ వెళ్లకండి' అన్నాను.

శకుంతల ఆగలేదు. బస్సు ఎక్కేసింది. వెళ్లిపోతున్న బస్సువైపు పిచ్చివాడిలా చూస్తూ నిలబడిపోయాను.

"ఆటో కావాలాసార్!" అన్న పిలుపుతో ఉలిక్కిపడి నేనుండే లాడ్జి పేరు చెప్పి ఆటోలో కూర్చున్నాను. ఆగిన ఆటోలోంచి దిగి, ఫేర్ చెల్లించి రూమ్‌లోకి ఎలా వెళ్లానో, పురుషోత్తమ్ వచ్చేవరకూ కాలాన్ని ఎలా గడిపానో నాకే తెలీదు.

పురుషోత్తం వచ్చి సరదాగా మాట్లాడేడు. ఆ మాటల్ని ఆసక్తిగా వినలేకపోయాను. కానీ పురుషోత్తం ఆ తర్వాత మొదలుపెట్టి



న విషయం మాత్ర నన్నాకర్షించింది.

''ఇందాక పరిచయం చేశాను చూడు. శకుంతల అనే అమ్మాయిని. షి ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్. చాలా మంచి అమ్మాయి. కానీ ఆమె జీవితంలో ఓ అపశృతి పలికింది. అందుకే ఒంటరిగా వుండిపోయింది.''

''ఏం జరిగింది?'' ఉత్సుకతను పైకి కన్పించకుండా జాగ్రత్తపడుతున్నాను.

''తన బాధల్నీ, కష్టాల్నీ అందరితో చెప్పుకునే అమ్మాయి కాదామె. కానీ నాకు చెప్పింది మా మధ్య జరిగిన ఓ సంఘటనవల్ల...''

''మీ మధ్యా? ఏం జరిగింది?''

''ఆమె మా పత్రికలో చేరింతర్వాత ఆమెను ప్రేమించాను నేను ఆలస్యం చేయకుండా ఆమె దగ్గర నా అభిప్రాయాన్ని వెల్లడి చేశాను. అప్పుడు చెప్పింది ఆమె విషయం. చెప్పి 'ఇప్పుడుకూడా నన్ను ప్రేమిస్తావని అంటారా?'' అని అడిగింది. అనేవాడ్నే, ఆమె మళ్లీ మరో విషయం చెప్పి వుండకపోతే! అప్పట్నుంచీ ఆమెనా దృష్టితో చూడ్డం మానేశాను. అయినా మేమిద్దరం మంచి స్నేహితులం''

పురుషోత్తం చెప్పే తీరులోని సస్పెన్స్‌ని తట్టుకోలేక, తట్టుకోలేనట్లుగా పైకి కన్పించకుండా ''చెప్పేదేదో వివరంగా చెప్పు ఉత్తమ్!'' అన్నాను చాలా కాజువల్‌గా. పురుషోత్తమ్ చెప్పడం మొదలుపెట్టాడు.

☆ ★ ☆

''ప్రేమ, ఆరాధన ఇలాంటి పదాలు వాడ్డం అన్నాచురల్‌గా వుంటుందేమో. మీరంటే నాకు ఇష్టం. మీరంగీకరిస్తే మిమ్మల్ని పెళ్లి చేసుకుంటాను''

పురుషోత్తం గొంతులోని సిన్సియారిటీకి, మాటల్లోని సింప్లిసిటీకి శకుంతలకు అప్పటికే అతనిమీద ఉన్న గౌరవం మరింత పెరిగేదే, కానీ ఆ విషయాన్ని మాత్రం ఆమె తట్టుకోలేకపోయింది.

''అయాం సారీ ఉత్తమ్. మరింకేదైనా మాట్లాడండి''

''ఈ విషయం మాట్లాడాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను శకుంతలా... ప్లీజ్, మీ అభిప్రాయం చెప్పండి''

''ఉత్తమ్. మీమీద నాకెంతో గౌరవం వుంది. కానీ ఈ విషయంలో నేనేమీ చెప్పలేను.''

''అయితే నేనంటే మీకు ఇష్టంలేదని అనుకోవచ్చా?''

''ఇక్కడ ఇష్టం కాదు. నా మాటలకు అర్థం. నా పరిస్థితి''

''అదెలాంటిదైనా పర్వాలేదు. నా ఆశకు ఊపిరి పోయండి చాలు''

''లేదు ఉత్తమ్. నా పరిస్థితి ఆ అవకాశం ఇవ్వలేదు''

''అదే అదేమిటో చెప్పండి కనీసం''

ఒక్క నిమిషం తలదించుకుంది శకుంతల. గాఢంగా ఓ నిట్టూర్పు విడిచి... ''ప్రేమ అనండి. ఆరాధన అనండి లేదా మీరన్నట్లు ఇష్టం అనండి. అది కలిగిన మగవాడు శీలాన్నికూడా కోరుకుంటాడు. నా విషయంలో దాన్ని ఓ అర్ధరాత్రి కొందరు దోచుకున్నారు. బయటకాదు. మా ఇంట్లో. పైవాళ్లుకాదు. బంధువులన్న వాళ్లు. ఒంటరిగా వున్నప్పుడు వచ్చారు.

బంధువులేకదా అనుకున్నాను. యువకులనీ, దుర్మార్గులనీ అనుకోలేదు. పెళ్లయితే ఒకత న్తో మా ఇంట్లోనే నా శోభనం జరిగేది. కానీ ముగ్గురితో రేప్ జరిగింది. ఆ దురదృష్టకరమైన సంఘటనవల్లనే నేను ప్రేమను నోచుకోలేను. పెళ్లికి ముందడుగు వేయలేను.

ఒక్క నిమిషం వాళ్లిద్దరి మధ్యా నిశ్శబ్దం.

"చాలా పాతకాలంనాటి మనసుమీది" గాఢంగా నిట్టూర్చి అన్నాడు ఉత్తమ్.

"అందుకే నన్ను అర్థం చేసుకోలేకపోయి ంది. ఈ కారణం నా ఇష్టాన్ని ఏమాత్రం చెడగొట్టలేదు"

"మీ ఇష్టాన్ని చెదరగొట్టలేనంత మాత్రా న నాలో ఇష్టం పుట్టాలని ఎక్కడుంది?"

"అంటే మాపట్ల మీకు ఇష్టం..."

"అదేంకాదు. శీలాన్ని మీరు లెక్కలోకి తీసుకోకపోవచ్చు. కానీ మరొకరికి అంకిత మైన మనసుని మీరు ఆశిస్తారా?"

"అంటే...?"

"ఒక వ్యక్తిని కోల్పోయిన నేను శీలం కోల్పోయిన కారణంగా చాలా ఘోరంగా దూరం చేసుకున్నాను. అతని మనసుని ముక్కలు చేశాను ప్రేమిస్తూనే"

"ఎవరతను...?"

"గతాన్ని తవ్వకండి ఉత్తమ్. రండి వెళ్లిపోదాం"

☆ ★ ☆

నా గుండె బ్రద్దలైంది పురుషోత్తం చెప్పింది విని...

"అప్పటినుండి మళ్లీ ఆ విషయం ఆమెతో ప్రస్తావించలేదు. కానీ ఆమె మనసు మారితే ముందుగా నాతో సంప్రదిం చకుండా ఏ అడుగూ వేయొద్దని, కాలం నన్నెంతవరకు ఆగనిస్తుందో అంతవరకూ ఆగుతానని అన్నాను" చెప్పడం ఆపాడు పురుషోత్తం.

నాలో అది ఆందోళనో, ఆవేశమో,

## టైమ్

ఆఫీసర్ తన లేడీ సెక్రటరీని సూటిగా చూస్తూ అడిగాడు

"ఈ రోజు రాత్రి నీకు ఖాళీయేనా"

"తీరికేసార్" సిగ్గుపడుతూ అందామె.

"అయితే ఈ రోజైనా తొందరగా నిద్రపోయి రేపు కరెక్ట్ టైంకు ఆఫీసుకు రా"

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



ఆవేదనో మరేమోగానీ ఉప్పొంగి నన్ను వె్రరివాడ్ని చేసింది.

"నీతో చెప్పిన ఆ మాటకు నువ్వేకాదు. నేనైనా ఆమెను నా గుండెలకు హత్తుకునేవా డిని. నా దాన్నిగా చేసుకునేవాడిని. ఆపాటి విశాల హృదయం నీకేకాదు. నాక్కూడా వుంది. కానీ నీకిచ్చిన అవకశం నాకివ్వకుండా తనేదో త్యాగం చేస్తున్నట్టు ఒక్క ఉత్తరం ముక్కతో ఒక్కసారిగా దూరమైపోయింది. నా హృదయాన్ని ముక్కలు చేసింది. నా ఆశల్ని త్రుంచేసి రేకులు రాలిన పువ్వులా తనెందుకు అలా వుండిపోవాలి. జీవితాంతం ఓ ప్రక్క మనసుమ కొరికే గతాన్ని నాకెందుకు మిగల్చాలి.:. నువ్వే చెప్పు ఉత్తమ్?

నేను లోలోపల నాలో నేనే అనుకోవడం లేదని, పిచ్చివాడిలా బిగ్గరగా అంటున్నానని.. ... "మూర్తీ మూర్తీ.. ఏమిటి నువ్వంటున్న దేమిటి?" అని అడుగుతున్న ఉత్తమ్‌ని చూసేవరకు నాకు తెలియనేలేదు.

"ఏమిటి మూర్తీ...?" అని మళ్లీ అడిగాడు ఉత్తమ్ నా కళ్లలోకి చూస్తూ.

"శకుంతలను అ్రపేమించిన, ఆమెచే ్రపేమించబడిన వ్యక్తిని నేనే! నా గతం పుస్తకంలో మళ్లీ మళ్లీ చదువుకోడానికి మడతపెట్టి వుంచుకున్న పేజీ శకుంతల"

☆ ★ ☆

నేను మర్నాడే బయల్దేరి పోయాను.

"శకుంతల జీవితంలో జరిగిన ఆ సంఘటన దురదృష్టకరమైనదే. ఒక మా మూలు అమ్మాయిలా కాకుండా నాకో ముక్కరాసి వుంటే ఆమెకూ నాకూ మధ్య దూరంగా ఇంతగా పెరిగిపోయి వుండేదికా దు.

ఉత్తమ్ నా కళ్లల్లోకే చూస్తూ వుండిపో యాడు.

"ఆమెను అందుకోలేనంత దూరం నేనెలాగూ ప్రయాణం చేసేశాను. అందుకే నా మాటగా శకుంతలకు చెప్పు..."

"ఏమిటి?"

"ఆమెకోసం ప్రయాణాన్ని ఆపుకుని వేచివున్న నీతో శకుంతలని మిగతా ప్రయా ణం చేయమని వేడుకున్నానని చెప్పు. ముక్కలైన నా మనసు అప్పుడైనా కాస్త ఊరట చెందుతుందని అన్నానని చెప్పు... చెప్తావా?"

అలాగే అన్నట్టు తలూపాడు ఉత్తమ్.

ఉత్తమ్ కళ్లల్లో నా మాటలు వెలుగు నింపాయని, ఏదో ఆశతో అతని గుండె నిండిందని అన్పించింది ఆ క్షణంలో.

అప్పుడే రైలు కదిలింది.

☆ ★ ☆

ఓ ఆర్నెల్లవుతుందేమో... నాకో వెడ్డిం గ్ కార్డు అందింది.

అందులో నేననుకున్న రెండు పేర్లూ వున్నాయి.

ఉత్తమ్ — శకుంతల.

ఆ కవర్లోనే చిన్న కాగితం.

... నా పెళ్లికి నువ్వు తప్పకుండా రావాలనే నాకుంది. కానీ శకుంతలకు అలా లేదని చెప్పింది — ఉత్తమ్!

శకుంతల ఆలోచనతో నా ఆలోచనా కలిసింది.

☆ ★ ☆

ఓ నెల తర్వాత ... పోస్ట్‌లో నాకో వీడియో క్యాసెట్ అందింది!